**దేశ ఆర్థిక వ్యవస్థ దిగజారుతోంది**

**కేంద్రంలో కుంభకోణాలు పెరిగాయి**

**బ్లాక్‌మనీని వైట్‌మనీగా మార్చారు**

**రైతుల రుణాలు మాఫీ చేయడం లేదు**

**పెట్టుబడిదారులకు రాయితీలు**

**రొహింగ్యాలను మానవతా ధృక్పథంతో ఆదుకోవాలి**

**అక్టోబర్లో రైతాంగ, నవంబర్లో కార్మికవర్గ ఆందోళనలు**

**మీట్ ది ప్రెస్‌లో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి**

బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత దేశ ఆర్థిక వ్యవస్థ దిగజారుతోందని, నల్లధనాన్ని తెల్లధనంగా మార్చారు మినహా చేసిందేమీ లేదని సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. రెండు లక్షల కోట్లకుపైబడి పెద్దల రుణాలు రద్దు చేసిన ప్రభుత్వం రైతుల రుణాలను రద్దు చేయడానికి ఇష్టపడటం లేదని తెలిపారు. మూడేళ్ల క్రితం మోడీ అధికారంలోకి రాకముందు యువత ఆయన వెంట ఉందని చెప్పారని, ప్రస్తుతం యువత పూర్తిగా దూరమైందని, అన్ని యూనివర్శిటీల్లో జరిగిన ఎన్నికలే దీనికి ఉదాహరణని అన్నారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు.

ప్రజా సమస్యల పరిష్కారం దిశగా జాతీయస్థాయిలో ఉద్యమాలను నిర్వహిస్తామని, అక్టోబర్లో రైతాంగ ఉద్యమం, నవంబర్లో కార్మిక ఉద్యమం జాతీయస్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. రోహింగ్యాలను మానవతా ధృక్పథంతో ఆదుకోవాలని, టెర్రరిస్టులనే పేరుతో వారిని అడ్డుకోవడం సరైంది కాదని అన్నారు. టెర్రరిస్టులు ఉన్నట్లైతే వారిపై చర్యలు తీసుకోవాలని, అమాయకులను మాత్రం ఆదుకోవాలని తెలిపారు. గతంలో బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, టిబెట్, బర్మా నుండి వచ్చిన శరణార్థులను ఆదుకున్నామని, అదే రీతిలో రోహింగ్యాలను ఆదుకోవాలన్నారు.

మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్థిక వ్యవస్థ వెనక్కుపోతోంది మినహా ముందుకెళ్లడం లేదన్నారు. డిమానిటైజేషన్ వల్ల నల్లడబ్బును పట్టుకుంటామన్నారని, అది జరగకపోగా నల్లడబ్బు మొత్తం తెల్లడబ్బుగా మారిపోయిందన్నారు. బ్లాక్‌మనీపై ఇంతవరకు ఒక్క కేసు కూడా నమోదు కాలేదని పేర్కొన్నారు. ఉగ్రవాదులకు డబ్బు అందకుండా చేస్తామన్నారని, ఆచరణలో ఉగ్రదాడులు, సర్జికల్ స్ట్రైక్స్ పెరిగాయని తెలిపారు. దేశంలో వ్యాపం, శారదాస్కాం, సహారా వంటి వేలకోట్ల కుంభకోణాలు జరిగాయని పేర్కొన్నారు.

దేశంలో ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని బిజెపికి చెందిన మాజీ ఆర్థిక మంత్రి యశ్వంత్‌సిన్హాయే చెప్పారన్నారు. పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు తీసుకున్న 10.5 లక్షల కోట్లు ఎన్‌పిఏలుగా మారిపోయాయని తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో పారిశ్రామిక ఉత్పత్తి 4.5 శాతానికి తగ్గిందని, వ్యవసాయవృద్ధి గతేడాది 4.9 శాతముంటే ఈ ఏడాది రెండుశాతానికి పడిపోయిందని, నిరుద్యోగం పెరిగిందని, 96 లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయని చెప్పారు.

ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించారని, మూడేళ్లుగా రూ.60 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో పెట్టినట్లు బిజెపి ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. రైతుల ఆత్మహత్యలూ విపరీతంగా పెరిగాయన్నారు. సర్వీసు సెక్టార్ దెబ్బతిందన్నారు. పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలు 60 వేలమందిని తొలిగించాయని, ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితమేనన్నారు. గతంలో దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ ఉజ్వల్ యోజన అన్నారని, ఇప్పుడు అదే పథకానికి మరోపేరు పెట్టి ముందుకు తీసుకొచ్చారని తెలిపారు.

మతతత్వ ధోరణి పెరుగుతోందని, బిజెపిని వ్యతిరేకించే మేధావులు, జర్నలిస్టులను హత్య చేస్తున్నారని కల్బుర్గి, పన్సారే, గౌరీ లంకేష్, శంతన్‌గౌమిత్ హత్యలు ఇదే కోవలోనివని తెలిపారు. గోరక్షణ పేరుతో దళితులు, ముస్లిములను దారుణంగా హత్య చేస్తున్నారని, రాజస్థాన్‌లో మరణ వాంగ్మూలాన్ని రద్దు చేశారని, ఇంతకంటే నియంతృత్వం మరొకటి ఉండదన్నారు. విశ్వ విద్యాలయాల్లో ఎబివిపిని ప్రోత్సహించడం ద్వారా మతతత్వ రాజకీయాలు జొప్పించాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నించిందని, దీన్ని యువత అడ్డుకుందని అన్నారు. ఇటీవల జరిగిన అన్ని యూనివర్శిటీల్లోనూ ఎబివిపిని చిత్తుచిత్తుగా ఓడించడమే దీనికి నిదర్శనమని చెప్పారు.

జిఎస్‌టి వల్ల తీవ్ర ఇబ్బందులొస్తాయని తెలిపామని, అయినా బిజెపి ప్రభుత్వం పట్టించుకోలేదని, ఆచరణలో అదే నిజమైందని తెలిపారు. దీనివల్ల ప్రజలకు లబ్ధి కలగకపోగా వికలాంగులు వాడే వస్తువులపైనా ఐదుశాతం ట్యాక్స్ పడిందని చెప్పారు. అదే సమయంలో ఎక్కువ పన్ను ఉన్న పెట్రోలియం ఉత్పత్తులకు జిఎస్‌టిని వర్తింపజేయలేదని, ఫలితంగా ఆరునెలల కాలంలో లీటరు పెట్రోలుకు ఏడు రూపాయల వరకూ పెరిగిందని, కనబడకుండానే ప్రజలను తీవ్రంగా దోచుకుంటున్నారని తెలిపారు. ఈ విషయంలో ప్రజలకు లబ్ధి కలిగించాల్సింది పోయి ప్రభుత్వాలే భారాలను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు.

ఈ నేపథ్యంలో కలిసొచ్చే వారందరినీ కలుపుకుని జాతీయస్థాయిలో ఆందోళనలు నిర్వహిస్తామని చెప్పారు. ఆర్థిక పోరాటాలతోపాటు, సామాజిక పోరాటాలనూ ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రజా ఉద్యమాలను అణచివేయాలనుకుంటే తగ్గవని, ప్రజల్లో ఉన్న వ్యతిరేకత అంతకంతకూ బయటకు వస్తుందని తెలిపారు. ఉద్యమాలను అణగదొక్కాలనే చంద్రబాబు ఆలోచనలను ప్రజలే తిప్పి కొడతారని పేర్కొన్నారు. కంచె ఐలయ్యపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరు సరికాదన్నారు. ఎవరి అభిప్రాయాలు వారు చెబుతారని, ఆయన పుస్తకాలు రద్దు చేయడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. అవసరమైతే ప్రభుత్వాలు ఆయనకు భద్రత కల్పించాలని తెలిపారు. పవన్ కళ్యాణ్ విషయంలో రాష్ట్ర పార్టీ కమిటీ చర్చించి నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. కేంద్రంలో బిజెపి అనుసరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను నిర్మిస్తున్నామని చెప్పారు. దీనిలో అందరినీ కలుపుకుపోతామని తెలిపారు. ఇప్పటికే మేధావులు, ప్రజాతంత్రవాదులతో ఒక కమిటీ వేశామని చెప్పారు. మీట్ ది ప్రెస్‌లో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కె.జయరాజు, విలియంపాల్, అంబటి ఆంజనేయులు, బాబు, జనార్థన్ తదితరులు పాల్గొన్నారు.